క్లుప్తంగా

నేటి నుంచి రైల్వేగేటు మూత

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు ప్రధాన రహదారిలోని స్థానిక రైల్వే గేటు(లెవెల్ క్రాసింగ్ గేట్)ను నేటినుంచి తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 2వ తేదీనుంచి 5వ తేదీ సాయంత్రం 6గంటల వరకు రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం రైల్వే గేటును మూసివేస్తున్నట్లు తెలిపారు. జమ్మలమడుగుకు ప్రయాణించే వాహనాలు ఈ మార్గంలో సంచరించడానికి వీలుండదని స్థానిక ప్రజలు గమనించాలని రైల్వే అధికారులు తెలిపారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

ముద్దనూరు : రాబోయే సాధారణ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన పలు పోలింగ్ బూత్‌లను రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. మండలంలో మొబైల్ సిగ్నల్స్ అందుబాటులో లేకుండా ఇబ్బందులు ఎదురయ్యే దేనేపల్లె, చిన్నకత్తెరపల్లె బూత్‌లను ఆయన పరిశీలించారు. వీటితో పాటు ఇతర పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. మండలంలోని 220, 223, 230, 232, 233 పోలింగ్‌స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మీనా తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా



పాలూరు గ్రామంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

పెద్దముడియం : మండలంలోని పాలూరు గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడటంతో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, సాంబశివారెడ్డి, బలరామ్ గ్రామ ప్రజలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి గ్రామంలో ఏర్పడిన నీటి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే పాలూరు గ్రామంలో నీటి సమస్య తీరేవరకు తన సొంత ఖర్చులతో గ్రామంలోని ప్రజలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన వెంటనే గ్రామంలో నీటి సరఫరాను ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

శుభ్రతను పాటిద్దాం.. ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం

పులివెందుల టౌన్ : స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వలంటీర్లతో కలిసి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక 4వ వార్డులోని అహోబిలాపురం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ హాజరై మాట్లాడారు. ఈ క్యాంపు వల్ల విద్యార్థులు మంచి విలువలు, సత్ ప్రవర్తన, దేశభక్తి అలవాటు అవుతుందన్నారు. సమాజం కొరకు ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్లాస్టిక్ నిర్మూలించేందుకు ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, ఆ వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్, పీఆర్‌ఓ బాలనారాయణ, శ్రీయుత శ్రీనివాసులరెడ్డి, విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పులివెందుల రూరల్ : ఈనెల 8న మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ డీఎం చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. శివరాత్రి పండుగను పురస్కరించుకుని పులివెందుల డిపో నుంచి పొలతలకు 27 బస్సు సర్వీసులు, భానుకోటకు 3 బస్సు సర్వీసులు, అలాగే ఈనెల 12,13 తేదీలలో లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరకు 18 బస్సు సర్వీసులను నడుపుతున్నామన్నారు. అలాగే పులివెందుల ప్రాంతంలోని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి నంద్యాల ఆర్టీసీ డిపోకు శ్రీశైలం పంపేందుకు బస్సులను ఆ డిపోకు పంపిస్తామన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థి ప్రతిభ

పులివెందుల టౌన్ : జాతీయస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో లయోల పాలిటెక్నికల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానంలో నిలిచి ప్రోత్సాహక బహుమతులను అందుకున్నారు. ఫిబ్రవరి మాసంలో ఆన్‌లైన్ ద్వారా అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లరేషన్ రీసెర్చ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ నిర్వహించిన ఈ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు సుష్మ, విజయహేమంత్‌రెడ్డిలు ప్రథమ స్థానంలో నిలిచి ప్రోత్సాహక బహుమతులను అందుకున్నారు. సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బ్రిట్టో, కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

వేంపల్లె : యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో వేంపల్లి వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బి.ఎస్సీ (ఎంపీసీఎస్) ఉత్తమ ప్రతిభ కనపరిచారని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. అలాగే బీఏ, బీకాం విద్యార్థులు కూడా ఉత్తమ ప్రతిభ కనపరిచారని యన తెలిపారు.

హంస వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో ప్రాచీన దేవాలయమైన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 9వ రోజు శుక్రవారం రాత్రి శ్రీరంగనాథస్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. స్వామి వారికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం నాటితో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కె.వి.రమణ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత పటిష్టం



సతీష్‌రెడ్డి

వేంపల్లె : తెలుగుదేశం పార్టీని వీడి నాలుగు సంవత్సరాలుగా రాజకీయాలకు దూరంగా ఉన్న మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ సింగారెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలోకి రావడంతో పులివెందుల నియోజకవర్గంలో ఆ పార్టీ మరింత పటిష్టం కానుంది. సతీష్‌రెడ్డి తాత సింగారెడ్డి నాగిరెడ్డి పేరు చెబితే తెలియని పాత తరం నేతలు ఉండరు. ఆయన రాజకీయ వారసుడిగా ఆ కుటుంబం నుంచి వచ్చిన ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి స్వశక్తితో అంచలంచలుగా ఎదిగారు. తెలుగుదేశం పార్టీకి పులివెందుల నియోజకవర్గంలో పెద్ద దిక్కుగా నిలిచి ఎన్నో రాజకీయ పోరాటాలు చేసి ఒక నేతగా నిలిచారు. 1999 నుంచి 2019 వరకు ఐదు టర్మ్‌లు పులివెందుల టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేశారు. ఓడిపోతామని తెలిసినా టీడీపీ పార్టీ పరువుకోసం పోటీచేస్తూ వచ్చారు. మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో ఉంటూ వైఎస్ కుటుంబంతో పోరాడినా టీడీపీ అధినేత చంద్రబాబు, కుమారుడు లోకేష్‌లు వైఎస్ కుటుంబంతో లాలూచీ పడ్డారని తనను ఘోరంగా అవమానించారు. ఎంత కష్టపడినా చెప్పుడు మాటలు విని ఆ పార్టీలో చమత్కారాలు, అవమానాలను చవిచూశారు. దీంతో 2019లో ఆయన తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. మరలా శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాను కప్పుకున్నారు. దీంతో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు వైఎస్సార్‌సీపీకి కైవసం చేసుకున్నాయి. ఎస్‌వి.సతీష్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలోకి రావడంతో నియోజకవర్గంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉంది.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : అభివృద్ధి, సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 5వ వార్డు సాయిబాబా దేవాలయం సమీపంలోని వీధులలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు పథకాలను అందిస్తున్నాడన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చారన్నారు. చాలా రాష్ట్రాలు ఈ వ్యవస్థలను ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. జడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మైలవరం మండలపరిధిలోని రామచంద్రాయపల్లె, మద్దిరెడ్డిపల్లె గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న సంక్షేమపథకాలు అందాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలో కేవలం వారి కార్యకర్తలకు మాత్రమే అందేవన్నారు. సంక్షేమ పథకాలతో మేలు జరిగిన కుటుంబాలు జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే మోసపోయినట్లే



ప్రజలకు పథకాలను వివరిస్తున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లను నమ్మితే మోసపోయినట్లేనని చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన చక్రాయపేట మెయిన్ రోడ్డు, వీరనారాయణపల్లె, నక్కలదిన్నెపల్లె, జగనన్న కాలనీ, తక్కళ్లపల్లె, మల్లప్పగారిపల్లెల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో వారికి ఎంతమేర ఆర్థికంగా సాయం అందిందో వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా తన మేనిఫెస్టోతో భారీగా మోసం చేశాడన్నారు. మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నాడని వాళ్లను నమ్మొద్దని తెలిపారు. జగనన్న మళ్లీ అధికారంలోకి వస్తే గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచు హర్షాద్, ఎంపీటీసీలు లీలావతి, గంగిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి, మండల యూత్ కన్వీనర్ రామాంజులరెడ్డి, పార్టీ నేతలు జనార్ధనరెడ్డి, గంగిరెడ్డి, బాబు, అక్బర్‌వల్లి, రెడ్డెప్పరెడ్డి, మధుసూదనరెడ్డి, మను, ఉపసర్పంచు గంగిరెడ్డి, బాలనాగిరెడ్డి, రఘునాథరెడ్డి, జయచంద్రారెడ్డి కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల ఎంపీడీఓగా జాషువా

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఎంపీడీఓగా జాషువా శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల బదిలీలో భాగంగా రైల్వేకోడూరులో ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు.

వేముల ఎంపీడీఓగా రాజేంద్రప్రసాద్

వేముల : మండల ఎంపీడీఓగా రాజేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న విజయరాఘవరెడ్డి కడప డీపీఆర్సీ కోఆర్డినేటర్‌గా బదిలీపై వెళ్లారు. కడప సీఈఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ వేముల ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు.

నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

పెద్దముడియం : రాబోయే వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే వేసవి కాలంలో ప్రజలు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనరసింహ్మ, తహసీల్దార్ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ



కొత్తగా మంజూరైన పింఛన్ దారులతో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వ తాతలు, వికలాంగులు, వితంతువుల కోసం తాను ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్తగా దరఖాస్తు చేసుకున్న పింఛన్ దారులకు మార్చి 1వ తేదీన ఫించన్‌లను అందజేశారు. ఈ పింఛన్‌లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ రమణారెడ్డిలు అందజేశారు. అలాగే ఎస్‌బీఐ కాలనీ సచివాలయం, శ్రీరామా టెంపుల్ సచివాలయాలలో ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి కొత్తగా మంజూరైన ఫించన్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించండి

జమ్మలమడుగు : సచివాలయ ఉద్యోగులు ఎన్నికల సమయంలో తమ విధులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో సచివాలయ ఉద్యోగులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయలో పనిచేసే ఉద్యోగులు తమ విధులను బాధ్యతాయుతంగా నెరవేర్చాలన్నారు. ప్రజల నుంచి వచ్చె ప్రతి సమస్యను వెంటనే పరిష్కారం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీలకతీతంగా విధులను నిర్వహించాలన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వహించాలన్నారు. డీఈ నాగమల్లేషు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష కేంద్రం తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపా సాహెబ్‌పేట పరిధి సచివాలయంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.నాగరాజు సందర్శించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న డ్రైడేను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలోని ప్రజలు ప్రతి ఒక్కరూ మురుగు నీటిని నిల్వలేకుండా తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీకేదిన్నె వైద్యుడు డాక్టర్ రాఘవేంద్ర, జిల్లా సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి సుకుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి ప్రసాదు, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

వేముల : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని ముబ్బుచింతలపల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి నిరుపేదకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ శిబిరంలో స్పెషలిస్టు వైద్యులచే అన్ని రకాల వైద్యులకు ఉచితంగానే పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను అందిస్తారన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. అనంతరం చికిత్స పొందిన రైతులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, వైద్యులు శరణ్యారెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల హక్కులను సంరక్షించడమే మానవ ధర్మం

వేంపల్లె : సమాజంలో సాటి ప్రజల కష్టాలను తెలుసుకుని వారిని ఎలా రక్షించాలో తెలుసుకోవడం వారిని కాపాడడం మానవ ధర్మమని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ప్రపంచ ప్రజా సంరక్షణ దినం సందర్భంగా శుక్రవారం కళాశాలలోని చరిత్రశాఖ, రాజనీతి శాస్త్రం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ప్రజల సంరక్షణ మానవాళి శరణ్యమని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చరిత్రశాఖ విభాగాధిపతి బాలకొండ గంగాధర్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను, దుస్థితులను, విపత్తులను గమనించి వారికి సహాయపడేటట్లు ప్రజలలో అవగాహన తేవడానికి ప్రపంచ దేశాలు ఈ మార్చి 1వ తేదీన ప్రపంచ ప్రజా సంరక్షణ దినాన్ని జరుపుకోవడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో తెలుగుశాఖ విభాగ అధిపతి డా.నాగలక్ష్మిదేవి, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి మాధవరావు, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు మల్లేశ్వరమ్మ, రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు ప్రసాదు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి

పెద్దముడియం : మండలంలో ప్రముఖ దేవాలయమైన మాధవ–ఆంజనేయ దేవస్థాన అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాధవ–ఆంజనేయ దేవస్థాన పాలక మండలి చైర్మన్‌గా ఎల్.శ్రీనువాసులరెడ్డి, సభ్యులుగా వై.కిరణ్‌కుమార్ రెడ్డి, టి.పద్మావతి, జి.రమేష్‌రెడ్డి, సి.లక్ష్మిదేవి, టి.బాలనరసమ్మ, పి.వరలక్ష్మి దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ఈవో విశ్వనాథరెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆలయ పాలక మండలి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని అలాగే ఆలయ పరిధిలో జరిగే అన్ని కార్యక్రమాలను విజయవంతంగా జరపాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లది ఎనలేని కృషి

తొండూరు : రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు ఎనలేని కృషి చేశారని రాష్ట్ర శాప్ డైరెక్టర్ తొండూరు మండలాధ్యక్షుడు రవీంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగు ఎళ్లగా వలంటీర్లు ప్రజల సేవలను గుర్తించి వారికి రాష్ట్ర ప్రభుత్వం సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను అందజేశారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో వలంటీర్లు కీలకంగా వ్యవహించారన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం వైద్యాధికారి వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహ న ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మార్చి 3వ తేదీన 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. నందిమండలం పీహెచ్‌సీ పరిధిలో 43 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



కమలాపురంలో గురుకుల పాఠశాల వద్ద తల్లిదండ్రులతో కలసి వచ్చిన విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వైఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నారాయణ కళాశాల, శ్రీ సాయి చైతన్య జూనియర్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించగా ఇందులో మొత్తం విద్యార్థులు 1097 మంది కాగా అందులో 28 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు మాస్ కాపింగ్ కొట్టకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

కమలాపురంలో..

కమలాపురం : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ఫస్టియర్ విద్యార్థులకు తెలుగు పరీక్ష కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య అధికారులు నిర్వహించారు. పట్టణంలోని గురుకుల పాఠశాల, పీవీఎస్‌ఆర్‌ఎం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. కాగా గురకుల కేంద్రంలో 259 మంది విద్యార్థులకు గాను 238 మంది హాజరయ్యారని, 21 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిటెండెంట్ తులశమ్మ, డిపార్ట్‌మెంట్ అధికారి చంద్రఓబుళరెడ్డి తెలిపారు. అలాగే పీవీఎస్‌ఆర్‌ఎం కళాశాల కేంద్రంలో 176 మందికి 163 మంది హాజరైయ్యారని 13 మంది గైర్హాజరయ్యారని చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. రెండు కేంద్రాల్లో 435 మందికి 34 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల కేంద్రంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వవైఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 59 మంది విద్యార్థులకు గానూ 6 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ స్వర్ణలత తెలిపారు. శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష వ్రాయనున్నట్లు ఆమె తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ఇంటర్ పరీక్షలు పట్టణంలోని 4 పరీక్ష కేంద్రాలలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ బాలుర కళాశాలలో 202 మంది విద్యార్థులు, సాయి పరమేశ్వర కళాశాలలో 217, బాలిక కళాశాలలో 277, అలాగే వివేకానంద కళాశాలలో 220 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



మంగలి నాగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చౌడయ్య



పెద్దపసుపుల గ్రామంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

కొండాపురం : మండలంలోని గండ్లూరు గ్రామానికి చెందిన మంగలి నాగమ్మ బ్రెయిన్ స్ట్రోక్‌తో అనంతపురంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన వలంటీర్ చౌడయ్య అనంతపురం వెళ్లి ఆసుపత్రిలో నాగమ్మ కు పింఛన్ అందజేశాడు. కుటుంబ సభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో వలంటీర్‌ను అభినందించారు.

తెల్లవారక మందే పింఛన్

పెద్దముడియం : రాష్ట్ర ప్రజలకు అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక మార్చి నెలకు సంబంధించి శుక్రవారం ప్రారంభమైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ వలంటీర్లు తెల్లవారక ముందే ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ రూ.3వేలను పంపిణీ చేస్తున్నారు. మండలంలో 5,257 మంది లబ్ధిదారులు ఉండగా తొలిరోజు 2,550 మందికి వలంటీర్లు ఫించన్ పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లక్ష్మి నరసింహ్మ తెలిపారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ వారు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1, 2 ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక రంగంలో నిత్య జీవితంలో జరిగే విపత్తులను, ఉపద్రవాలను అరికట్టడంతో సైబర్ సెక్యూరిటీ యొక్క ఆవశ్యకతను విభిన్న ఉదాహరణల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ సెక్యూరిటీ యొక్క ప్రాముఖ్యతను వ్యక్తి తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. బ్యాంకుల ద్వారా విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని, స్కాలర్‌షిప్‌లను విపులంగా వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, పీడీ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతికి దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ వెలువడినట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొందిన విద్యార్థులు దీనికి అర్హులని తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి వుంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21వ తేదీన పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ మేరకు సీట్లు కేటాయిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పంట నమోదు జాబితా సరిచూసుకోండి

పెద్దముడియం : రబీ పంటలకు సంబంధించి ఈ పంట నమోదు సోషల్ ఆడిట్‌లో భాగంగా ప్రతి రైతు భరోసా కేంద్రంలో నేడు, రేపు సామాజిక తనిఖీ జరుగుతున్నదని మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. రైతులు ప్రతి ఒక్కరు పంట నమోదు జాబితాలో మీ పేరు, పంట, విస్తీర్ణంలో ఏవైనా తప్పులు ఉన్నచో వాటిని వెంటనే తెలిపితే వాటిని పరిష్కరించి తుది జాబితాను విడుదల చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.